ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 5 జూలై 2024



ట్యాంక్‌బండ్‌పై కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి 8

నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలి 8



పల్లె ముంగిట మీ సేవ

- జిల్లాలో కొత్తగా పది కేంద్రాలు
- మహిళా శక్తి పేరుతో అతివలకు కేటాయింపు
- కేంద్రాల ఏర్పాటుకు స్త్రీనిధి ద్వారా రుణాలు
- కేంద్రాల్లో అదనపు వసూళ్లకు బ్రేక్
- క్యూఆర్ కోడ్ స్కానర్‌ల ద్వారా చెల్లింపులు
- జిల్లాలో 108 మీ సేవ కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలనా.. చదువులు, ఉద్యోగాలకు ధ్రువీకరణ పత్రాలు పొందాలనుకున్నా మీ సేవ కేంద్రాలే వారధిగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం తాజాగా మీ సేవ కేంద్రాల ద్వారా పౌర సేవలను మరింత సులభతరం చేస్తూ నిర్ణయం తీసుకుంది. పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర గ్రామ పంచాయతీలకే పరిమితమైన మీసేవ కేంద్రాలను అత్యవసరమున్న గ్రామాల్లో ఏర్పాటు చేయాలని భావించింది. ఇందులో భాగంగా గ్రామాల్లోనే మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మీ సేవ కేంద్రాల ద్వారా 40 రకాల ప్రభుత్వ సేవలు అందు బాటులో ఉన్నాయి. ఆధార్, ధరణి, స్థానికత, ఆదా యం, కులం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆర్టీసీ, రైల్వే, తిరుపతి దర్శనాల టికెట్ల వంటి సేవలు లభిస్తున్నాయి. వీటనన్నింటినీ గ్రామీణ ప్రాంతాల్లోనే పొందే వీలు కలగనుంది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, రెండు మున్సి పాలిటీల పరిధిలో 108 మీ సేవ కేంద్రాలు పని చేస్తున్నాయి. తాజాగా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామైక్య సంఘం పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులకు మీ సేవ కేంద్రాలను అందించే దిశగా నిర్ణయించారు. ఇందులో భాగంగా మహిళా శక్తి పథకం కింద పది మీ సేవ కేంద్రాలను మం జూరు చేశారు. మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి గ్రామాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. మీ సేవ కేంద్రాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా సంఘం సభ్యుల్లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించ నున్నారు. గ్రామైక్య సంఘం తీర్మానంతో ఎంపిక చేస్తారు.

జిల్లాలో స్వశక్తి సంఘాలు 9982 ఉండగా గ్రామ సంఘాలు 411, మండల సమాఖ్యలు 12, జిల్లా సమాఖ్య 1 పరిధిలో 1.13 లక్షల మంది సభ్యులు ఉన్నారు. గ్రామ పంచాయతీలు 255 ఉన్నాయి. వీటికి సంబంధించి మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేసే మీ సేవ కేంద్రాలు ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి అందుబాటు లోకి తేవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. జూలై 20వ తేదీ నుంచి కేంద్రాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మీ సేవ కేంద్రాలు ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీలు, మహిళా సంఘం భవనాలు, కమ్యూనిటీ భవనాలు, యువజన సంఘం భవనాలను ఉపయోగించుకునే విధంగా ఆదేశాలు ఉన్నాయి.

మీ సేవ కేంద్రాలకు రుణసాయం

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసే మీ సేవ కేంద్రాల నిర్వాహకురాలికి గ్రామైక్య సంఘం సిఫార్సుతో స్త్రీనిధి నుంచి రూ.2.50 లక్షల వరకు రుణ మంజూరు చేయనున్నారు. కంప్యూటర్, ప్రింటర్, కెమెరా, ఇంటర్‌నెట్, బయోమెట్రిక్ పరికరాలు, జీపీఎస్, టేబుళ్లు వంటివి సమకూర్చుకునే వీలు ఉంటుంది.

కేంద్రాల్లో అదనపు వసూళ్లకు బ్రేక్

మీ సేవ కేంద్రాల ద్వారా పౌరసరఫరాల సేవలు అందుతున్నా ప్రభుత్వం నిర్ణయించిన నగదు కంటే ఎక్కువ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదనపు వసూళ్లకు ప్రభుత్వం బ్రేక్ వేస్తోంది. మీ సేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపుల విధానాన్ని అమల్లోకి తేవడంతోపాటు సులభంగా సేవలు అందే విధంగా చర్యలు చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 108 మీ సేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా నగదు రహిత చెల్లింపులు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా రుసుము వసూలు చేస్తున్నారు. దీని ద్వారా వినియోగదారులకు ఎంతో ఇబ్బందులు కలగనున్నాయి.

నగదు రహిత చెల్లింపులు
శ్రీనివాస్, జిల్లా ఈడీఎం



మీ సేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపుల విధానం పక్కాగా అమలు చేయడానికి ఆదేశాలు ఇచ్చాం. ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించే విధా నం అమల్లోకి వచ్చింది. పక డ్బందీగా నిర్వహిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. దీంతో పాటు త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లో మహిళా శక్తి పథకం ద్వారా మరో పది మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం.

వ్యవసాయ కళాశాల పరిశీలన



కళాశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి, జూలై 4: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని వ్యవసాయ కళాశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్రీదేవితో కళాశాలలో ఇబ్బందులు తదితర అంశాలపై సమీక్షించారు. తాగునీరు, విద్యార్థుల సంఖ్య, తదితర అంశాలను తెలుసుకున్నారు. ఆది శ్రీనివాస్ సందర్శిస్తున్న విషయాన్ని తెలుసుకున్న భూములు కోల్పోయిన స్థానిక రైతులు ఆయనను కలిసి విన్నవించుకున్నారు. కళాశాలలో భవనాల నిర్మాణంతో తమ భూములు కోల్పోయామని, తమకు మరోచోట భూమి కేటాయించలేదని పేర్కొన్నారు. పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం



జడ్పీ చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న వైద్యులు

సిరిసిల్ల టౌన్, జులై 4: జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి పదవీ కాలం ముగిసిన సందర్భంగా గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో వైద్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్, ఆర్ఎంవో సంతోష్, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి మెడికల్ కళాశాలలో వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్య అందిస్తూ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన వైద్యులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాలను ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్‌తో కలసి జడ్పీ చైర్ పర్సన్ అరుణారాఘవరెడ్డి పరిశీలించారు.

మండల ప్రత్యేక అధికారులు వీరే..

సిరిసిల్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 12 మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. గురువారం వారు బాధ్యతలు స్వీకరించారు. బోయినపల్లి మండల ప్రత్యేకాధికారిగా జి.శివప్రసాద్-జిల్లా మత్స్య శాఖ అధికారి, చందుర్తి కె.కొమురయ్య - జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, ఇల్లంతకుంట బుద్ధ నాయుడు - జిల్లా సహకార శాఖ అధికారి, గంభీరావుపేట రాఘవేందర్ - జిల్లా ఉపాధి కల్పన అధికారి, కోనరావుపేట ఎస్.రాజేశ్వర్ -ఆర్డీవో వేములవాడ, ముస్తాబాద్ ఎం.జ్యోతి - జిల్లా ఉద్యాన శాఖ అధికారి, రుద్రంగి ఆర్‌వీ రాధాబాయి - స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్), తంగళ్లపల్లి రమేష్ ఆర్డీవో సిరిసిల్ల, వీర్నపల్లి జి.నర్సింహులు, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి, వేములవాడ బి.స్వప్న - జిల్లా ఆడిట్ అధికారి, వేములవాడ రూరల్ లక్ష్మీరాజం - జిల్లా సంక్షేమాఅధికారి, ఎల్లారెడ్డిపేట భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

సిరిసిల్ల క్రైం, జులై 4: సిరిసిల్ల టౌన్ సీఐగా కె. కృష్ణ, సిరిసిల్ల రూరల్ సీఐగా మొగిలి గురువారం బాధ్యతలు చేపట్టారు. కె. కృష్ణకు బదిలీపై వెళ్లిన సీఐ రఘుపతి చార్జి ఇచ్చారు. సిరిసిల్ల రూరల్ ఇన్స్‌పెక్టర్‌గా మొగిలికి సీఐ సదన్‌కుమార్ చార్జి ఇచ్చారు. అనంతరం ఇద్దరు సీఐలు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రెండో రోజు
కొనసాగిన కోడెల పంపిణీ

వేములవాడ కల్చరల్, జూలై 4 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలలో రెండో రోజు కోడెల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. మొదటి రోజున 60 మందికి కోడెలను పంపిణీ చేయగా రెండు రోజులపాటు 150 మందికి రాజన్న కోడెలను అందించినట్లు ఆలయాధికారులు తెలిపారు. అర్హులైన రైతులు ఆలయంలో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు జయంతి

గంభీరావుపేట, జూలై 4 : గంభీరావుపేట మండల కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారాంబజార్‌లనీలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా అల్లూరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యూత్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఏఎస్పీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ

వేములవాడ టౌన్, జూలై 4 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో ఆది శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆది శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.డీఎస్పీ నాగేంద్రచారి ఉన్నారు.

వివేకానంద వర్ధంతి

బోయినపల్లి, జూలై 4: మండల కేంద్రంలో గురువారం వివేకానంద వర్ధంతినిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివే కానందుడు భారతీయ సనాతన ధర్మ ఔన్నత్యాన్ని ప్రపం చానికి చాటి చెప్పిన యోగి అని కొనియాడారు. మాజీ సర్పంచ్ భూర్గుల నందయ్య, రాజేంద్ర ప్రసాద్, నరేష్ సురేష్ పాల్గొన్నారు,

నేత కార్మికులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేత కార్మికులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులోని పారిశ్రామికులతో సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి కార్ఖానాలను పరిశీలించారు. పారిశ్రామికులతో పార్కులో ఉన్న ప్రస్తుత పరిస్థితులు, ఉపాధి పొందుతున్న కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామికులు పార్కులో విద్యుత్ బిల్లులలో 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, పరిశ్రమల ఏర్పాటుకు ఎన్‌వోసీ ఇప్పించాలని కోరారు. కామన్ ఫెసిలేటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలోని నేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, కార్మికులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. నేత కార్మికుల సమస్యపై సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాతనే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. నేత కార్మికులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని యజమానులకు సైతం బకాయిలు విడతల వారీగా చెల్లిస్తున్నామని తెలిపారు. నేత కార్మికుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు త్వరలో అన్ని సంఘాల నాయకులు, కార్మికులు, యజమానులు, ఆసాములతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశ్రమ స్థితిగతులపై తెలుసుకున్నారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ వెంకట్‌రావు, ఏడీ సాగర్, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టెక్స్‌టైల్ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంకారపు కిరణ్, కోశాధికారి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి శివశంకర్, కళ్యాడపు సుభాష్, వాసం శ్రీనివాస్, బొద్దుల సుదర్శన్, దుబాల మొండయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, అకునూరి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు సహకారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జులై 4 : జిల్లాలో మహనీయుల విగ్రహాలు నెలకొల్పేందుకు తన వంతు సహాయ సహకారం అందిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం వాసవి కల్యాణ మండపంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దొడ్డి కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటాలు చేసిన మహనీయుడన్నారు. తెలంగాణ ప్రాంతానికి నాడు జరిగిన అన్యాయంపై, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం కోసం పోరాటాలు చేశాడని అన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు పోరాటాలలో ముందుంటారని అనడానికి దొడ్డి కొమరయ్య జీవితమే ఉదాహరణ అన్నారు. నేటి యువత నాటి యోధుల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మహనీయుల విగ్ర హాలు నెలకొల్పేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సిరిసిల్ల, వేముల వాడ ప్రాంతాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి ఎక్కడా ఆగదని, ప్రజలు అపోహపడవద్దని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగుతుల వారికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జేఏసీ జిల్లా చైర్మన్ బొజ్జ కనకయ్య, వర్ధంతి కమిటీ చైర్మన్ జగ్గాని మల్లేశంయాదవ్, జడ్పీటీసీ నాగం కుమార్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమా, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బండ మల్లేషంయాదవ్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు 'రైతు భరోసా' వర్తింపజేయాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 4: అసైన్డ్ భూములకు ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం వర్తింపజేయాలని రైతులు అభిప్రాయపడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ రామగిరి సుధీర్‌రావు అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ, రైతుభరోసాపై అభిప్రాయ సేకరణను గురువారం నిర్వహించారు. పట్టా భూములతోపాటు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు రైతుభరోసా అందించాలన్నారు. అనంతరం ఏవో భూమిరెడ్డి సాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఏఈవో ముకుందం, సంఘం డైరెక్టర్లు లక్ష్మన్, సంతోష్ రెడ్డి, సత్యారెడ్డి, శ్రీరాం, నారాయణ, నరహరి, గంగవ్వ పాల్గొన్నారు.

అన్నదాతల అభిప్రాయాలే కీలకం



వేములవాడలో రైతులతో మాట్లాడుతున్న డీసీవో బుద్ధనాయుడు

వేములవాడ టౌన్, జూలై 4: రైతబంధు పథకంపై రైతుల అభిప్రాయాలే ప్రభుత్వానికి కీలకం కానున్నాయని, రైతుల స్పష్టంగ తమ అభిప్రాయాలను తెలియజేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆపరేటివ్ అధికారి బుద్దనాయుడు రైతులకు సూచించారు. వేములవాడ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, నాంపల్లిలో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుబంధు పథకంపై రైతుల అభిప్రాయసేకరణ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడలో డీసీవో మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా కింద వ్యవసాయానికి పెట్టుబడి సహయం చేయాలని ఆశిస్తుందని, రైతుబంధు పథకం భూములు వున్న వారందరికి వర్తించాల, సాగు చేసుకునే వారికి వర్తించాలా.. అనే అంశంపై రైతులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సమా వేశానికి వచ్చిన రైతుల మాట్లాడుతూ రైతుబంధు పథకం కేవలం రైతులు సాగు చేసే భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే రైతుబంధు ఇవ్వాలని, బీడు భూ ములకు, వెంచర్‌లకు, వాగులకు వంకలకు, కుంటలకు సైతం రైతుబంధు వర్తింస్తుం దని అన్నారు. మరి కొంత మంది రైతులు పది ఎకరాల భూమి వరకు లిమిట్ పెట్టి రైతు బంధు అందించాలని తమ అభిప్రా యాలను వ్యక్త పరిచారు. రైతులు చెప్పిన సలహాలను, సూచనలను సంబందిత అధికారులు రికార్డు చేసుకున్నారు. ఆడిటర్ రవికుమార్, సీఈవో లక్ష్మణ్, వైస్ చైర్మన్ లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైతు వేదికలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సహకార సంఘ అధ్యక్షుడు చైర్మన్ తన్నీరు బాపురావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకర అధికారిగా బుద్ద నాయుడు హాజరయ్యారు. రైతులకు ప్రభుత్వం అందించే రైతు భరోసా ఎన్ని ఎకరాల వరకు అందిస్తే బావుటుందని రైతుల వద్ద నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. చైర్మన్ బాపురావు, వైస్ చైర్మన్ రాజేశం, డైరెక్టర్‌లు బాపురావు, సతీశ్‌చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో వసతి గదుల నిర్మాణానికి ప్రణాళిక

- శ్రీరాజరాజేశ్వర సదన్ పేరుతో నిర్మాణానికి సన్నద్ధం
- కసరత్తు చేస్తున్న అధికారులు



రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, జూలై 4: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతి గదుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమవుతోంది. నిత్యం వేల సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే రాజన్న ఆలయ పరిధిలో 430 వసతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఆది, సోమ, శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో వసతి గదులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆలయాధికారులు శ్రీరాజేశ్వరసదన్ పేరుతో వంద వసతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. యుద్ధప్రాతిపదికన జీ ప్లస్-2 బిల్డింగ్ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. రాజన్న ఆలయ ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు మరింత ముమ్మరం చేస్తున్నారు. దేవదాయశాఖ కమిషనర్ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లను ఆహ్వానించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాజన్న ఆలయ గడి చెరువులోని పార్కింగ్ స్థలంలో వంద వసతి గదుల ఏర్పాటుకు ఇప్పటికే స్థల పరిశీలన చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, ఆఫీస్ పర్పస్‌లో ఏర్పాటు చేసి, మొదటి అంతస్తులో 50 వసతి గదులు, రెండో అంతస్తులో మరో 50 వసతి గదులు మొత్తం వంద వసతి గదులు భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

శిథిలావస్థకు చేరిన పలు వసతి గదులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గతంలో నిర్మించిన పార్వతీపురం, శంకరపురం, శివపురం వసతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో భక్తులు వసతి గదుల్లో ఉండేందుకు విముకత చూపుతున్నట్లు తెలుస్తోంది. వీటీడీఏతో సంబంధం లేకుండా రాజన్న ఆలయ పరిధిలోనే ఉన్నటువంటి ఈ మూడు వసతి గదుల సముదాయాలను పూర్తిగా కూల్చి వేసి వాటి స్థానంలో భక్తులకు కొత్త వసతి గదుల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ఆలయాధికారులు దృష్టిసారించాలని, అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు నిధులు ఇవ్వండి

● సీఎంను కలిసిన పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, జూలై4: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలకు ప్రభుత్వ పక్షాన ప్రతి నెల 8లక్షల 30వేల నిధులు మంజూరు ఇప్పించాలని సీఎంను కోరారు. 2021లో గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని చెప్పి మాట నిలుపుకోలేదని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 52లక్షలకు ప్రతిపాదనలు పంపిస్తే కేవలం 16లక్షలు మాత్రమే విడుదల చేసిందని సిఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది జీతభత్యాలకు, హస్టల్ నిర్వహణకు డబ్బు లేకపోవడంతో సంక్లిష్ట పరిస్థితులలో పాఠశాల నడుస్తున్నదని పాఠశాల నిర్వహణకు ప్రతి నెల 8లక్షల 30వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మానసిక వికాలంగుల పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంవత్సరానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కూడా దానికి సానుకులంగా స్పదించినట్లు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చాడ వెంకట్‌రెడ్డి

ప్రమాదవశాత్తూ యువకులకు గాయాలు

సైదాపూర్, జూలై 4: సైదాపూర్ మండలంలోని రాయికల్ వాటర్‌ఫాల్స్ వీక్షించేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సంపత్, మన్నెంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకులు రాయికల్ వాటర్‌ఫాల్స్ అందాలు చూసేందుకు గురువారం వచ్చారు. వాటర్ ఫాల్స్ వద్ద తేనటీగలు వారిపై దాడి చేశాయి. దాంతో ఆ యువకులు తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయగా జారిపడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, స్థానికులు ఆ యువకులను 108 వహనంలో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 4: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎలవేణి మల్లయ్య(54) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లేని పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు

● పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ కుమార్

చందుర్తి, జులై 4 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుండగా మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఇందుకు విరుద్ధంగా విద్యా వ్యవస్థ కొనసాగుతుందని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం జడ్పీటీసీ సభ్యుడు కుమార్ సందర్శించారు. పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థుల సంఖ్య జీరో ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులు లేకపోవడంతో వంతుల వారీగా ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. ప్రధానోపాధ్యాయునితో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టడంతో జడ్పీటీసీ అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు లేకపోవడంతో ప్రతిరోజు ఉపాధ్యాయులు పాఠశాలలో కాలక్షేపం చేస్తున్నట్లు తనిఖీలో వెల్లడయింది. కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. కిష్టంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే ఉపాధ్యాయ పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపాలని జడ్పిటిసి సభ్యుడు కుమార్ జిల్లా విద్యాధికారికి ఫోన్‌లో మాట్లాడి కోరారు.



పాఠశాల పరిస్థితిపై డీఈవో ఫోన్‌లో మాట్లాడుతున్న జడ్పీటీసీ

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న ట్రేడ్‌యూనియన్ నాయకులు

భగత్‌నగర్, జూలై 4: సింగరేణి బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆల్ ట్రేడ్‌యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి నాయకులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, కళ్యాడపు ఆగయ్య, కె బుచ్చయ్య యాదవ్, లక్ష్మణ్, కూరపాటి రమేష్, ముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ప్రభ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నదని, సింగరేణి సంస్థను ప్రైవేట్‌సంస్థలతో వేలం పాటలో పోటి పడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. దేశభక్తి పేరుతో దేశసంపదను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీవిధానాలను ప్రజానీకం గుర్తించి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

చందుర్తి, జులై 4 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిని గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరుణ్ అనే యువకుడు హైదరాబాద్‌లో రూమ్‌మేట్ వద్ద నుంచి గంజాయి తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గురుకుల పనివేళలను సమీక్షించాలి

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థలకు నిర్ణయించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులుకుపై మానసిక ఒత్తిని పెంచే విదంగా ఉందని, వాటిని వెంటనే పునః సమీక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గురుకులాలను ప్రారంభించి అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సందర్భంలో ప్రస్తుత పనివేళలు సమర్థనీయంగా లేవన్నారు. విద్యార్థులు మూడు గంటల పాటు ఏకబిగిన అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవటం, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు భోజనం చేయకుండా ఉండడం ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యా సంస్థలు ఉన్న సందర్భంలో ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వ సెలవులు, పండుగ సెలవుల్లో కూడా పనిచేయాల్సిన సందర్భంలో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాటరీల దొంగను పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 4: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాల బ్యాటరీల దొంగను స్థానికులు గురువారం పట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గొల్లపల్లిలో కొంత కాలంగా ఆరుబయట నిలిపి ఉంచిన ఆటోలు, బైకులు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గురువారం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో నిలిపి ఉన్న ట్రాలీ ఆటో బ్యాటరీని చోరీ చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. అదే వాహనంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని తాళ్లతో చేతులను కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి బ్యాటరీలతో పాటు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని గుర్తించారు. ముఠాలో ఇద్దరు మహిళలున్నారని తేలింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 11.335 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.190 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

జైనాలో వైభవంగా పోచమ్మ బోనాలు

ధర్మపురి, జూలై 4: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలో గల ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మవారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జైనా రజక సంఘం అధ్యక్షులు సంగెపు గంగారాం, గౌరవ అధ్యక్షులు సంగెపు మల్లయ్య, సభ్యులు లచ్చయ్య, వెంకటి, గంగారాం, బుచ్చయ్య, మల్లయ్య శ్రీనివాస్, ప్రదీప్, అజయ్, సతీష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జైనా రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 4 : ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను చౌర్యం చేసిన కేసులో హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన కేశబోయిన తిరుపతికి ఒక నెల రోజుల సాధారణ జైలు శిక్ష లేదా 14,616 రూపాయల జరిమాననాను విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ గురువారం తీర్పు ఇచ్చారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఇంతియాజ్ మహ్మద్‌ఖాన్, బి రాజయ్యలున్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 181క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

● 2 కిలోల 70 గ్రాముల గంజాయి పట్టివేత
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, జూలై 4: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న బత్తిని చందు (23), గోల్ల వెంకటేష్ (25) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశానుసారంగా ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన నిందితులు చందు, వెంకటేష్ గంజాయి తాగుటకు బానిసగా మారారు. వారికి ఖర్చులకు డబ్బులు లేక గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుక వచ్చి తాగిన తర్వాత మిగిలిన గంజాయి ఎక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకుని వారి స్నేహితుడు రాము అనే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం కొనుగోలు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కువ ధరకు విక్రయించాలని నిందితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బత్తిని చందు తన మోటార్‌సైకిల్ సీటు కింద పెట్టుకోగా, గోల్ల వెంకటేష్ తన మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకర్ కవర్లో గంజాయి పెట్టుకుని ధర్మపురి వైపు వెళ్తున్నట్లు తెలిపారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే సాయంత్రం వేళలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద 2 కిలోల 70 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విలువ రూ 40,000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న రాము అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకుని గంజాయి సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ఏఎస్‌ఐ సూర్యనారాయణరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ శంకర్, వెంకటయ్య, రామస్వామి, కానిస్టేబుల్ రమేష్, నవీన్‌కుమార్, రమేష్‌నాయక్, సిబ్బందిని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మండలం కాపులపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డి (83) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల నుంచి రాంరెడ్డి పక్షవాతంతో బాధపడ్డాడు. బీపీ, షుగర్ లెవల్స్ పెరిగి ఇరువై రోజుల క్రితం కళ్లు తిరిగి కిందపడ్డాడు. అనారోగ్యం వల్ల తీవ్ర మనస్థాపానికి గురైన రాంరెడ్డి ఇంట్లో నుంచి జమ్మికుంటకు వచ్చి గడ్డి మందు కొనుక్కుని పాత వ్యవసాయ మార్కెట్లో తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

జమ్మికుంట, జూలై 4: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన మారుమూళ్ల పద్మ, లక్ష్మయ్య దంపతుల కుమార్తె కావ్య (28)ను ఎల్బాక గ్రామానికి చెందిన జీడి రాజు అనే వ్యక్తికి ఇచ్చి 12ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. మూడు సంవత్సరాలుగా దంపతులు ఇద్దరు పట్టణంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కావ్య ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న భర్త రాజు ఆమెను కొట్టడం మొదలు పెట్టాడు. వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కావ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

పీఏసీఎస్ రాయికల్‌కు ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సహకార సంఘ సభ్యులు

రాయికల్, జూలై 4: రాయికల్ వ్యవసాయ సహకార సంఘానికి గురువారం ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డు లభించింది. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ కో ఆపరేటివ్ ఎక్స్‌లెన్స్, మెరిట్-2023 అవార్డులో భాగంగా పీఏసీఎస్ రాయికల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, సీఈవో రవికుమార్, సిబ్బంది తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైమరీ కో ఆపరేటివ్ సొసైటీ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు రూ.20 వేల ప్రోత్సాహక బహుమతి కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీఎస్‌సీఏబీ ఎండీ బి.గోపి, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాయికల్ : రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డును సాధించడం పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీ


కోరుట్ల మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు


రంగాపూర్ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయ్ అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్‌మిల్లుల్లో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా, లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అయిదు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని తక్కలపల్లిలో గల వేణు ఇండస్ట్రీస్, మాదాపూర్‌లోని విఘ్నేశ్వర్ రైస్ మిల్, కోరుట్ల పట్టణంలోని కొత్త సురేశ్ రైస్ మిల్లు, మేడిపల్లిలోని వాసుదేవ రైస్ మిల్, పెగ్గెర్ల సాయి గణేస్ ట్రేడర్స్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్‌మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్, సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, నిర్మల్ డీఎం నందిని, పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్‌ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌ఓలు, డీఎంలు సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

వెంకటయ్య కళ్లు సజీవం


వెంకటయ్య (ఫైల్)

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల వెంకటయ్య (92) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు ముందుకు వచ్చారు. దీంతో వరంగల్ ఎల్‌విపి టెక్నీషియన్ సహకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు.

పెద్దమ్మ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 4: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో దొంగతనం జరిగిందని కొలకాని నర్సయ్య గురువారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 1 నుంచి 4 తేదీ ఉదయం వరకు గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మ ఆలయం తలుపులు పగుల గొట్టి సుమారు 15 వేల 500 రూపాయల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదాయ పన్నుపై అవగాహన అవసరం

- హరి అశోక్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్నుపై అవగాహన అవసరమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్‌తో ఆదాయపన్ను అంశంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. రుణం కోసం గానీ, వీసా కోసం గానీ దరఖాస్తు చేసుకునే సమయాల్లో పన్ను రిటర్నులు ఉపయోగపడుతాయన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాల కోసం పన్ను రిటర్న్ రుజువు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, నాయకులు ప్రకాశ్ రావు, దిండిగల విఠల్, ఎండీ యాకూబ్, సత్యనారాయణ, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వీణవంక,జూలై04:మండలంలోని నర్సింగాపూర్ గ్రామనికి చెందిన దాసారపు ప్రశాంత్ (29) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం ప్రశాంత్ ఆరు నెలలుగా మద్యానికి అలువాటై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి అన్న వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, జూలై 4 : అప్పుల బాధతో సావనపెల్లి స్వామి (37) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన సావనపెల్లి స్వామి అనే వ్యక్తి తమకు 5 ఎకరాల భూమి ఉండగా అప్పుల బాధతో అటు భూమిని అమ్మి వేశారు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అయినప్పటికీ వ్యవసాయంలో రాబడి రాక అప్పుల పాలయ్యాయి. అంతే కాకుండా భార్య లాస్య గుండె సంబంధించిన శస్త్ర చికిత్స కోసం కూడా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కోనరావుపేట ఎస్సై అంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణం పరిశీలించి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు తెలిపారు. మృతునికి తల్లి మైసవ్వ, భార్య లాస్య, కుమారుడు శ్రీహన్ ఉన్నారు.

ఒమన్‌లో బొమ్మెన వాసి మృతి


సత్యనారాయణ(ఫైల్)

కథలాపూర్, జూలై 4 : మండలంలోని బొమ్మెనకు చెందిన పంజాల సత్యనారాయణ (54) అనే గల్ఫ్ వలసజీవి బుధవారం రాత్రి ఓమన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం...సత్యనారాయణ రెండు సంవత్సరాల కిందట ఉపాధి నిమిత్తం ఒమన్ వెళ్లాడు. భవన నిర్మాణ కంపెనీలో కూలీగా పని చేస్తున్న సత్యనారాయణ డ్యూటీ ముగించుకుని గదికి వచ్చాడు. అప్పటి దాకా గదిలో ఉన్న సహచరులతో మాట్లాడిన సత్యనారాయణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తొందరగా పంపించే ఏర్పాట్లు చేయాలని, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

వ్యవసాయ బావుల మోటారు దొంగల అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 4: మండలంలోని తాళ్ళపెల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి కనుకయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారును దొంగిలించిన వారిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గురువారం తాళ్ళపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వడ్డూరు గ్రామానికి చెందిన బిగుళ్ళ శ్రావణ్, ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగాండ్ల అజయ్‌ను పట్టుకొని విచారించగా వ్యవసాయ మోటార్‌ను అపహరించి గుండ్లపల్లి గ్రామానికి చెందిన వనరాసి కొమురయ్యకు అమ్మినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుండి వ్యవసాయ మోటార్‌తో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


శంకరపట్నం, జూలై 4: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో టాస్క్‌ఫోర్స్, కేశవపట్నం పోలీసులు గురువారం 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వంకాయగూడెం గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను, దీరావత్ హరిలాల్, ధనావత్ శ్రీను ఇళ్లలో నిల్వ చేసిన 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ధాన్యం కమీషన్ డబ్బుల కింద ఫర్టిలైజర్

● డీసీఎంఎస్‌లో ఎరువుల అక్రమ అమ్మకాలపై ఏసీబీ విచారణ ● లక్ష రూపాయల లంచంతో పట్టుబడిన మేనేజర్, క్యాషియర్


ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, మేనేజర్ వేంకటేశ్వర్‌రావు


కరీంనగర్ క్రైం, జూలై 4: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో ధాన్యం కొనుగోలు, ఫర్టిలైజర్ అమ్మకాలపై ఏసీబీ పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా డీసీఎంఎస్‌కు వచ్చిన కమీషన్ డబ్బులో 50 శాతం కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్‌కు బిల్లు చెక్ రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ఫర్టిలైజర్‌ను డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు బలవంతంగా కాంట్రాక్టర్ కావటి రాజుకు అంటగట్టి అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఫర్టిలైజర్ ఇచ్చేందుకు లైసెన్స్ కలిగి ఉండాలని, కాంట్రాక్టర్ చేత బలవంతంగా వ్యవసాయశాఖ నుంచి అతడి ఊరిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహణకు లైసెన్స్ తీయించిన తరువాత ఫర్టిలైజర్‌ను ఇచ్చినట్లు బాధిత కాంట్రాక్టర్ తెలిపారు. కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ సుదగోని కుమారస్వామిలు డీసీఎంఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ వాకటి రాజు వద్ద లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. 2018-19 సీజన్ నుంచి 2023-24 సీజన్ వరకు ధాన్యం కమీషన్ డబ్బులు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు(పెండింగ్ బిల్లులు) కోసం కాంట్రాక్టర్ తిరిగి వేసారిపోయాడు. కాంట్రాక్టర్‌కు చెక్ రూపంలో చెల్లించాల్సిన డీసీఎంఎస్ మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా అతడికి 20 లక్షల 91 వేల 500 రూపాయల విలువ కలిగిన ఫర్టిలైజర్‌ను ఇచ్చాడు. మరో 69 లక్షల 25 వేల 152 రూపాయల ఫర్టిలైజర్‌ను కమీషన్ డబ్బుల కింద ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదరగా ఇందుకు లంచంగా 15 లక్షల రూపాయలు మేనేజర్‌కు కాంట్రాక్టర్ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఈ సమయంలోనే మొదటి లక్ష రూపాయలు తీసుకుంటున్న క్రమంలో మేనేజర్, క్యాషియర్‌లను ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా ఏసీబీకి పట్టుబడిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఆగస్టు నెలలో పదవీ విరమణ చేయనున్నారు. తనకు రావాల్సిన కమీషన్ బిల్లు కోసం 5 సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, అప్పులు తెచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించానని బాధితుడు కావటి రాజు తెలిపారు. తన కమీషన్ డబ్బులు డీసీఎంఎస్‌కు వచ్చినప్పటికీ చెక్ ఇవ్వకుండా లంచం డబ్బుల కోసం తనకు ఫర్టిలైజర్‌ను అంటగట్టారని వాపోయాడు. ఫర్టిలైజర్ బస్తాకు 15 రూపాయలు అదనంగా లెక్కగట్టారని, తన ఊరికి అదనంగా మరో 15 రూపాయల రవాణా చార్జి అయిందని, ఈ విధంగా బస్తాకు 30 రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అతడు వాపోయాడు.


మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి , బాధితుడు రాజుయాదవ్

● కరీంనగర్ రీజియన్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, బాధితుడు కావటి రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తి అయిన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కావటి రాజు అనే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా డీసీఎంఎస్‌కు క్వింటాల్ ధాన్యానికి 32 రూపాయల కమీషన్ వస్తుండగా అందులో నుంచి 50 శాతం అనగా 16 రూపాయలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ కావటి రాజుకు చెల్లించాలని ఒప్పందం ఉంది. దీని ప్రకారం 2018 నుంచి 2023 వరకు వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణపై కాంట్రాక్టర్ రాజుకు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ రాజుకు డబ్బులు ఇవ్వాలంటే లంచం కోసం డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ రాజు ఏసీబీని ఆశ్రయించాడు. లంచం డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ కుమారస్వామిలను అరెస్టు చేశామని, శుక్రవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దు

● సీపీఎం కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యుడు చెరుపల్లి సీతారాములు


ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 4: నేతన్నలు ఉపాధి లేదంటూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల జీవితాలతో రాజకీయం చేయకుండా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. సిరిసిల్ల పట్టణంలో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్‌లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాలను పరామర్శించారు. వారికి సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో కార్మికులతో మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాటాల ద్వారానే అన్ని సాధించుకుంటామని అన్నారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్‌ను కలిసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో నిర్మిస్తున్న అపెరల్ పార్కులో వర్కర్ టు ఓనర్ షెడ్లను పరిశీలించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రధానంగా నాలుగు సమస్యల వలన పూర్తిగా సంక్షోభంలోకి కూరుకపోయి మొత్తం పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. ప్రధాన సమస్యలు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు కరెంటు సబ్సిడీ తొలగించడం, మార్కెట్‌లో ప్రస్తుతం తయారు చేసే వస్త్రానికి డిమాండ్ లేకపోవడంతో పాటు పాత బకాయిలు విడుదల చేయకపోవడం వలన వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడడంతో పాటు కార్మికులకు ఏడు నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. కార్మికులకు సరైన ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇప్పటివరకు 9 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే దీన్ని రాజకీయ కోణంగా చూడకుండా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూతన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ పరిశ్రమలకు ఉచిత విద్యుత్ అందించాలని లేకుంటే గతంలో మాదిరిగా అన్ని కేటగిరీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, లేకుంటే జనతా వస్త్రాల పథకం ద్వారా ఒక చీర, ఒక పంచా సిరిసిల్లలో ఉత్పత్తి చేయించడంతో పాటు వర్కర్ టు ఓనర్ వెంటనే పూర్తిచేసి కార్మికులను యజమానులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యారన్ సబ్సిడీతో పాటు బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, సిరిమల్లె సత్యం జవ్వాజీ విమల, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను బెదిరించిన యువకుల పట్టివేత


బస్టాండ్‌లో ఆర్టీసీ సెక్యూరిటీ అదుపులో ఉన్న పాత నేరస్థులు

కరీంనగర్ క్రైం, జూలై 4: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను బెదిరింపులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరు యువకులు పాత నేరస్థులు, గంజాయి సేవించేవారని ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు తెలిపారు. పట్టుకున్న ఇద్దరిని ఒకటో ఠాణా పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రమణ, ఎం.సాగర్, సెక్యూరిటీ కానిస్టేబుల్ కవిత, నవీన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి


గాండ్ల శ్రీనివాస్(ఫైల్)

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ బస్‌స్టాప్ వద్ద కారులో అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్ (34) హైదర్షాకోట్ వెస్ట్రన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ వృత్తీ రీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు రోజులు నుంచి ఇంటికి రాలేదు. గురువా రం మధ్యాహ్నం శాంతినగర్ బస్‌స్టాప్ సమీపంలోని పార్కింగ్ ఏరియాలో కారులో నుంచి దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. కారులో శ్రీనివాస్ మృతి చెందినట్లు కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంక్‌బండ్‌పై కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

వేములవాడ టౌన్, జూలై 4: దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ డిమాండ్ చేశారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నైజాం సర్కార్, భూస్వాముల, జమీందార్ల, దేశ్‌ముఖ్‌ల, దొరల దోపిడీ అణచివేత, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా నిలిచిన గొప్ప వ్యక్తి దొడ్డి కొమురయ్య అన్నారు. ఆయనను విస్మరించవద్దన్నారు. అనంతరం జడ్పీటీసీ నాగం కుమార్ మాట్లాడతూ దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో గ్రామాల్లో నైజాం దొరలకు, భూస్వాములకు, రజాకార్లకు ఎదుర్కొంటున్న సమయంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం తెలంగాణ ప్రజలు మరువరాదన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ జక్కుల తిరుపతి డిమాండ్ చేశారు. జడ్పీటీసీ నాగం కుమార్, వైస్ ఎంపీపీ జక్కుల కవిత తిరుపతి, కురుమ సంఘం నాయకులు గుంటి కనుకయ్య, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, జిల్లా నాయకులు చిమ్మల్ల మల్లేశం, గంటి శంకర్, మ్యాకల మల్లేశం, గుంటి సాయికుమార్, ఏనుగుల శ్రీనివాస్, కృష్ణ, బుగ్గయ్య, ముత్త మహేష్, పర్శరాములు, అనిల్, అంజి, దేవరాజు ఉన్నారు.

గంభీరావుపేట: గంబీరావుపేట మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, యాదవ సంఘం నాయకులు గోగు లింగంయాదవ్, పెద్దవేని వెంకటి, కృష్ణకాంత్, దేవయ్య బొంగ మల్లేశం, దేవేందర్, రాజు, కృష్ణమూర్తి, వెంకటి, ఎలుక రాజు, శ్రావన్. మహేష్, దేవరాజు, భూమయ్య, నాయకులు ఉన్నారు.

ముస్తాబాద్: భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ముస్తాబాద్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు రాగం నాగరాజు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి కూడలిలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం యాదవకుర్మ సామాజిక వర్గం, కాంగ్రెస్, బీజేపీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, నాయకులు గజ్జెల రాజు, మెంగని మనోహర్, శీలం స్వామి, యాదవ కుర్మ సంఘం ప్రతినిధులు చెవుల మల్లేశం, తాడెపు ఎల్లం, తాడెపు రవి, దొరగొల్ల బాలయ్య, కోడె శ్రీను, శీల శ్రీను, భైతీ మల్లేశం, బండారి యాదగిరి, కావటి ఎల్లయ్య, జిగిరి కుమార్, కంతుల భాస్కర్, జిగిరి మల్లయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

సిరిసిల్ల కలెక్టరేట్: కలెక్టరేట్‌లో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



నివాళులు అర్పిస్తున్న తుల ఉమ, నాయకులు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, భూమయ్య, అనూష్, బాల్‌రెడ్డి, లక్ష్మన్, కిష్టయ్య పాల్గొన్నారు.

బోయినపల్లి: దొడ్డి కొమురయ్య వర్ధంతిని బోయినపల్లి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బోయినపల్లి మండల కేంద్రంతోపాటు విలాసాగర్‌లో కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రహితంగా పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని జరుపుకున్నారు విలాసాగర్‌లో కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు బోయినపల్లి మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గుంటి శంకర్, బోయిని రాజు , నల్లగొండ అనిల్ కుమార్, దూస రామస్వామి, సంబ పర్శరాములు, బోయినీ కొమురయ్య ఉన్నారు

వీర్నపల్లి: దొడ్డి కొమురయ్యకు వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు మద్దిమల్ల ఆయా గ్రామాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. మదిమల్ల గ్రామంలో గొల్ల కురుమ యాదవ సంఘం సభ్యులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చందుర్తి: చందుర్తి దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ నాగం కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన



రాజన్న ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 4: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి ఆలయ అర్చక స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. రాత్రి ఆలయ స్వామివారి అద్దాల మండపంలో నిర్వహించిన మహాలింగార్చన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేయాలి



పుస్తకం అందజేస్తున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 4 : సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి విగ్రహాలను సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి విగ్రహాల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐలో తన ప్రస్థానంపై ముద్రించిన పుస్తకాన్ని అందజేశారు.

సాహితీవేత్త కిరణ్‌కుమార్‌కు సన్మానం



సన్మానం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 4: సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత, సాహితీవేత్త, విమర్శకుడు చిటికెన కిరణ్‌కుమార్‌ను గురువారం చేనేత వస్త్ర వ్యాపార సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్, ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షులు ఎనుగుల ఎల్లయ్య, శ్రీగాధ విష్ణు, సాప గణేష్, పారిశ్రామిక వేత్తలు చిలుక సత్యం, చిటికెన వెంకటేశం, ఎనుగుల లక్ష్మణ్, గౌడ కిరణ్, చిటికెన కనకయ్య యెల్దండి శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజాసేవ గొప్ప అనుభూతి

చందుర్తి, జూలై 4 : చందుర్తి మండల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు సంవత్సరాలు సేవలు చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ అన్నారు. ఎంపీపీ పదవీకాలం ముగిస్తున్నందున గురువారం ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పదవి కాలంలో మండలంలో విద్య, వైద్యంతోపాటు రంగాలపై అభివృద్ధి సాధించడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ సహకారంతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తనకు సహకరించిన మండల ప్రజలకు, అధికారులకు, ఎంపీటీసీగా ఎన్నుకున్న నర్సింగాపూర్, అనంతపల్లి, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కళాశాలల యాజమాన్యాలు



వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల నిర్వాహకులు

వేములవాడ టౌన్, జూలై 4 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కలిసి వినతిపత్రం అందజేశాయి. వేములవాడ పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో బుధవారం సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆయాచితుల జితేందర్‌రావు, గుండా శ్రీకాంత్, భూమేష్, విష్ణు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

సిరిసిల్ల రూరల్, జూలై 4 : సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించిన పూర్వవిద్యార్థులు ప్రోత్సాహకంగా గురువారం నగదు పారితోషికాన్ని అందజేశారు. కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో 1961- 62లో బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది పది ఫలితాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారని, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నలుగురు విద్యార్థులకు రూ.4 వేల చొప్పున నగదు పారితోషికాన్ని పూర్వవిద్యార్థులు అందించారు. ఇన్‌స్పైయిర్ అవార్డుల్లో జాతీయ స్థాయికి వెళ్లిన విద్యార్థి జక్కని హేమంత్‌కు కూడా రూ.4 వేల నగదును అందించారు. పూర్వవిద్యార్థులు చిట్నేని శ్రీనివాసరావు, మడుపు ముత్యంరెడ్డి, రాజూరి మురళినాథ్, గూడూరి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతిలాల్, స్టాఫ్ సెక్రెటరీ కుమ్మరి మల్లేశం, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు దాసరి రవీందర్, పాతూరి మహేందర్‌రెడ్డి, బొమ్మవరం గోవిందరావు, పాకాల శంకర్‌గౌడ్, పూల సరిత, సంధ్యారాణి, హజ్జునాయక్, శ్రీహరి, సాంబయ్య, మంజులత, అజాద్‌ఫాతిమా, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, దేవత ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి

ఇల్లంతకుంట, జూలై 4: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకులు నాగసముద్రాల సంతోష్, కొలనూరి ముత్తక్కలు కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి హరీష్‌రావు 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. శంకుస్థాపన జరిగి పదినెలలు గడిచిపోతున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించాలన్నారు.

పెద్దూర్ గోపాల యూత్ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, జూలై 4 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గోపాల యూత్ నూతన కార్యవర్గాన్ని బుధవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దూర్ శివారులోని ఇప్పలపల్లెలోని శ్రీకృష్ణ యాదవ సంఘ భవనంలో గోపాల యూత్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా సలేంద్రి మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా నక్క నరేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సలేంద్రి ప్రశాంత్‌యాదవ్, కోశాధికారిగా సలేంద్రి శేఖర్‌యాదవ్, కార్యదర్శిగా సలేంద్రి మధుయాదవ్ ఎన్నికయ్యారు.

బెల్ట్ షాపుల నియంత్రణలో విఫలం

సిరిసిల్ల టౌన్, జూలై 4: బెల్ట్ షాపుల నియంత్రంలో కాంగ్రెస్ విఫలమైందని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లోని జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో బెల్ట్‌షాప్‌లను నిషేధిస్తామని, మద్యం విక్రయాలపై నియంత్రణ విధిస్తామన్న అన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా మద్యం విక్రయాలను నియంత్రించలేకపోయిందన్నారు. వైన్స్‌ల పర్మిట్ రూములు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనాలకు వ్యతిరేకంగా నడుస్తున్న బెల్ట్‌షాప్‌లు, పర్మిట్ రూములపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సలేంద్రి ఎల్లయ్య, బొద్దుల శ్రీహరి, కుడికాల లక్ష్మన్, వేముల రాజేశం, దుమాల నర్సయ్య, వేముల శ్రీధర్, మేర శ్రీనివాస్, భాస్కర్, అంజనేయులు, మర్కండేయులు, సత్తయ్య కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు



భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 4 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఆవరణలో సెస్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏటా నిర్వహించే దసరా పండుగ వేడుకల సందర్భంగా రాజరాజేశ్వరస్వామి, అనంత పద్మనాభస్వామి వార్ల పల్లకి సేవ ఊరేగింపులో ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వర్షకాలం సమయంలో చెట్లు విద్యుత్ స్తంభాలను వ్యాపించి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఏటా చెట్లను పెంచడం, నరికివేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్, సెస్ అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే వనోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని, పెరిగే వృక్షాల మొక్కలను స్తంభాల వద్ద నాటకుండా చూడాలని అన్నారు. మోతాదు స్థాయి వరకు పెరిగే పూల మొక్కలను, పండ్ల మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్ నామాల ఉమాలక్ష్మీరాజం మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన పదవీకాలం.. ఎంపీటీసీలకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు



ఎంపీటీసీలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట, జూలై 4: మండలంలోని పెద్దలింగాపూర్ ఎంపీటీసీ కరివెద స్వప్నరత్నాకర్‌రెడ్డిని గురువారం గ్రామస్తులు సన్మానించారు. ఎంపీటీసీ పదవీకాలం ముగియడంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రజలు తనపై విశ్వాసం ఉంచి ఎన్నికలలో గెలిపించారని, వారి అంచనాలకు అనుగుణంగా పనిచేశానని తెలిపారు. నాయకులు పసుల వెంకటి, మాతిరెడ్డి కిషన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, భూమయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ప్రతిపక్ష ఎంపీటీసీగా ప్రజల సమస్యలపై పోరాడడం అభినందనీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఐదేళ్ల పదవి కాలం ముగిసిన నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో బండలింగంపల్లి ఎంపీటీసీ పద్మ-దేవయ్య దంపతులను నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. సేవలను కొనియాడారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, రాజునాయక్, రాంరెడ్డి, రాజేందర్, కిషన్, బాల్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాములు, సుధాకర్, రాజేశం, శ్రీనివాస్, ఇమాం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: పదవీకాలం ముగిసినందున మండలంలోని పలువురు ఎంపీటీసీలను రూరల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఎంపీటీసీలు రంగు వెంకటేశం, బొడ్డు శంకరవ్వరాములు, చెన్నాడి శ్యామలగోవర్ధన్‌రెడ్డిలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ సత్కరించి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రొండి రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, నాయకులు సోయినేని కరుణాకర్, అడ్డిక జైపాల్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సోయినేని లహరి, సురేష్, రోమాల ప్రవీణ్, ఈడపల్లి అనిల్, రాజేశం, సంజీవ్, రణధీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట, కొండాపూర్ గ్రామాల ఎంపీటీసీ పల్లె మంజుల రవీందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు గురువారం సన్మానించారు. ఎంపీటీసీ పదవీకాలం ముగియడంతో మంజులను సన్మానించారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ఫిరోజ్ పాషా, నాలుక సత్యం, నందు గౌడ్, వెంకటేశం, మంతెన నరేష్, తిక్కల సాగర్, తిరుపతి, శ్రీనివాసరెడ్డి, వేణు, మంతెన మల్లేశం, నరసింహ రెడ్డి , మాధవరెడ్డి, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇబ్బందులు

రుద్రంగి, జూలై 4: కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో లబ్ధిదారులకు అధికారులు సరైన సమాచరం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మానాలకు చెందిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులు ప్రభుత్వ విప్ చొరవతో వచ్చినట్లు చెప్పారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, మనోహర్, గంగనర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలు నిర్మించాలి

చందుర్తి, జూలై 4: ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలు లేని పల్లెల్లో నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ అన్నారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెలో ఎమ్మార్పీఎస్ జెండాను గురువారం పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవంలో భాగంగా జెండా గద్దెలు లేని చోట నిర్మించుకొని దండోరా జెండా ఎగురవేయాలన్నారు.

విద్యుత్ స్టార్టర్ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జూలై 4: తన వ్యవసాయ భూమిలోని విద్యుత్ స్టార్టర్‌ను ధ్వంసం చేయడంతోపాటు చంపుతామని బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు బింగి మల్లేశం గురువారం తెలిపాడు. గురువారం వేకువజామున పొలం వద్దకు వెళ్లగా తన మరదలు లక్ష్మీ, ఆమె కొడుకు నిఖిల్, స్థానికుడు సలువాల శ్రీనివాస్, నారాయణరావుపేట మండలం బంజేరుపల్లికి చెందిన యాదగిరి విద్యుత్ స్టార్టర్‌ను ధ్వంసం చేశారని ఆరోపించాడు.

నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలి



సిరిసిల్లలో బంద్ చేయిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 4 : నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం ఐక్య విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ పిలుపు మేరకు విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని పలు పాఠశాలలకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ విద్యార్థి యువజన సంఘాలకు చెందిన నాయకులు వెళ్లి బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాల్లారపు ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెల్పుల సాయిప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాంతుల మహేష్, మాల్లారపు అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఎన్‌టీఏను రద్దు చేసి దేశంలో పాఠశాలల మూసివేతలను నిలిపివేయడంతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్నస్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని దేశంలో పాఠశాలల మూసివేతను విరమించుకోవాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, అధిక ఫీజులను నియంత్రించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, నేదూరి శ్రీకాంత్, రాకేష్, సాయితేజా, ప్రవళిక, సంతోష్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో వామ పక్ష విద్యార్థి సంఘాలు గురువారం ఇచ్చిన బంద్ పిలుపు విజయ వంతమైంది. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ చేశారు. ఈ సంధర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ పాలనలో విద్యారంగం భ్రష్టు పట్టిందన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విదానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్, అరుణ్, రాకేష్, శ్రీకాంత్, గాపాల్, భరత్, అజయ్ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అయినందున పరీక్షను తిరిగి నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను గురువారం మూసివేయించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పరీక్షలను నిర్వహించడంలో విద్యాశాఖ విఫలమైందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ నియంత్రించేందుకు చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పనికాశి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు బండారి సన్నీగౌడ్, మూడపెల్లి అనీల్, తన్మయి, మచ్చ అభి, మామిడి కౌశల్, శ్రీహరి, మంద మహేష్ పాల్గొన్నారు.



విద్యాసంస్థలను బంద్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు



తరగతులను బహిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నీట్ అవకతవకలపై విద్యార్థి , యువజన సంఘాల నేతలు, ఎస్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బంద్ తలపెట్టారు. నీట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్ఎస్‌యూఐ సిరిసిల్ల నియోజక వర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మిరుదొడ్డి భానుకుమార్, ఎన్ఎస్‌యూ మండల అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలో చేపట్టిన ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతమైంది. నీట్ వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల బంద్ చేపట్టారు.

రుద్రంగి: ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల బంద్ నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యావల దిలీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్, నాయకులు శ్రీహర్ష గౌడ్, నాగరాజ్, నిఖీల్, రాహుల్, రాము పాల్గొన్నారు.

కోనరావుపేట: నీట్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రాజూరి వెంకటేష్ కోరారు. నీట్ రద్దు చేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఇచ్చిన పిలుపుమేరకు కోనరావుపేట మండలంలో విద్యాసంస్థలను బంద్ చేశారు. నాయకులు రాకేష్, రాజు, వినయ్, రంజిత్, సృజన్, రాహుల్ ఉన్నారు.